కథానిక

# ఒడిపోయిన రామూ

రంధి సోమరాజు

వాళ్లిద్దరూ స్నేహితులనటానికేమంత ఆస్కారము లేదు. విరోధులు మాత్రము కాదనే చెప్పాలి. కాని వాళ్లు స్నేహితులనే లోకం అనుకుంది. అయితే లోకం అనుకోనిదేముంది? అది అనేకరకమైన వాటిగురించి తనకు తోచినట్లు సిద్ధాంతీకరించుకొని కూర్చుంటుంది. అయితే ఈ సిద్ధాంతాల ప్రభావం వాళ్ళమీద ప్రసరించకుండా ఉండలేదనీ చెప్పలేము. కాని నిజానికి వాళ్ళిద్దరూ స్నేహితులమనే అనుకున్నారు. ఇంతకీ విచిత్రమేమిటంటే వాళ్లు స్నేహితులమని అనుకుంటూనే విరోధుల్లా ప్రవర్తిస్తారు. నిజానికి ప్రపంచంలో ఎవరైనా గొప్ప విరోధులున్నారంటే వాళ్ళి కుటుంబాలలోని భార్యాభర్తలనే చెప్పాలి. అయితే వాళ్ళంత స్నేహంగా ఉండేవాళ్ళు కూడా అరుదే! సరిగ్గా ఇదే స్థితి వీళ్ళలోనూ ప్రతిబింబిస్తూన్నదా అంటే అదీ అనుమానమే!

మన అనుమానాల మాట ఎలా ఉన్నప్పటికీ ఇదీ-అదీ అని కచ్చితంగా చెప్పటానికివీలులేని వాళ్ళ స్నేహాలతను గురించి కాస్త పరిశీలిద్దాం.

వాళ్ళిద్దరికీ స్నేహం ఒకానొక ఆటల పోటీలలో కలిగింది- అది వాళ్ళ చిన్నప్పుడు. అట్లా వాళ్లు స్నేహితులౌతూనే వాళ్ళొకరినొకరు అనుమానించుకున్నారు, ద్వేషించుకున్నారు.

చెడుగుడులో ఇద్దరూ "కూత" బాగానే కూసేవారు. అట్లా ఆ కూత కూసేటప్పుడు, "వాడు హెచ్చుసేపు కూయగలుగుతున్నాడా-నేను హెచ్చుసేపు కూయగలుగుతున్నానా" అన్న భావం వాళ్ళల్లో ప్రజ్వలించి ఒకరిమీద ఒకరికి ఈర్ష్యను కలిగించేది. కూతలోనే కాకుండా ఆటలో కూడా వాళ్ళిద్దరిదే పైచేయి కావటం వల్ల, ప్రేక్షకలోకం లోంచి వచ్చే ప్రశంసలు తమకే చెందాలని, ఇద్దరూ కాంక్షించేవారు, ఆశించేవారు. వారికవి చెరిసమానంగానే లభించేవి.

బాజ్జీ కూత కూస్తూ రావటం, తమాషాగా అతని కాలి సీలమండ, కదలటానికి వీలులేకుండా,ఒడుపుగా రాము పట్టుకోవటం-మిగతా సైన్యం ముట్టేయడం - వీళ్ళందరినీ తోసుకొని మహాబలంతో బరిమీదకు బాజ్జీ వచ్చి పడటం, అప్పుడే పెదవి కరచుకోవటం-ప్రేక్షక లోకం చప్పట్లు మిన్నుముట్టడం ఒక్కసారిగా సాగిపోయాయి. వెంటనే బాజ్జీమీద పడ్డ ఆటగాళ్లు తప్పుకున్నారు. అతని పెదవి వెంట కారిపోతూన్న రక్తాన్ని రామూ తన చొక్కాతో అప్రయత్నంగా తుడుస్తున్నాడు. రాము అట్లా తుడుస్తూవుంటే, బాజ్జీ కాదనలేదు. అతనిలో విజయసూచకమైన గర్వచిహ్నం తొణికిసలాడింది రాము బాజ్జీ ముఖం చూడకముందే "తుడిస్తే ఏమి పోతుంద"నుకుంటూ, "అరే! ఇలా ఎందుకు చేశాను? నా చొక్కా అంతా రక్తం అయిపోయిందే!" అని బాధపడ్డాడు. రాము తుడిచినందుకు బాజ్జీకేమీ కృతజ్ఞత కలుగలేదు. పైపెచ్చు "రాము తన కాలు ఎంత గట్టిగా పట్టుకున్నాడు!" అని అనుకున్నాడు. "నేనెంత గట్టిగా పట్టుకున్నా విజయం వాడిదే అయిపోయిందే" అని రాము విచారించాడు. అయితే ఇవి వాళ్ళ మనస్సుల్లో కలిగిన పరివర్తనలే. పైకి ఒకసారి చూసుకొని ఓ నవ్వు నవ్వుకున్నారు. తరువాత ఆ చెడుగుడు క్షేత్రంలో ఏమాత్రం ఓ క్షణం ఖాళీ అయినా వాళ్లెదురుగా ఉన్న తమ ముఖాలలోకి చూసుకోవడం - అట్లా చూసుకున్నప్పుడల్లా ఇద్దరి ముఖాలలోనికి నవ్వు తరుముకు రావడం జరిగింది. ఈ నవ్వు రావడంలోని ఉద్దే

కము వాళ్ళకు బోధ పడలేదు. కాని ఎందుకనో ఊరికే నవ్వు వస్తూంది. చివరి కొనాటికి ఆట అయిపోయింది. ఆరోజు నే వాళ్లు రోజూ కలవటానికి వీలైన పరిస్థితి ఏర్పడ్డది.

బాజ్జీ యింటికీ, రామూ యింటికీ చాలా దూరం ఉంది. ఆ దూరం వాళ్ల ఇళ్లమధ్య నే కాకుండా వాళ్ళ ఇళ్ళకూ, వాళ్ళ పరిస్థితులకూ కూడా ఉంది. బాజ్జీ ఆ రోజుల్లో ధనవంతుని బిడ్డ. అతని ఇళ్లో నౌకర్లున్నారు. వాళ్ళతన్నెప్పుడూ "చిన్నదొర గా"రంటారు. స్కూల్లో మాష్టార్లుకూడ అతన్ని "ఏమోయ్" అంటారు.

ఇక రాము ఇల్లు చిన్న పెంకుటిల్లు. అదైనా అద్దెకొంప. అతనింట్లో వాళ్లెవ్వరూ, చివరకు "చిట్టిబాబు" అనైనా పిలవరు. వాళ్ళన్నయ్య రోజూ "ఏరా" అంటూ "ఇది చేయలేదు అది చేయలేదు" అని మొట్టికాయలు వడ్డిస్తాడు. వాళ్ళ మాష్టారుకూడ "ఏరా" అనే పిలుస్తాడు. అయితే రాము, ఇట్లా పిలవటాన్ని ఎప్పుడూ అపార్థం చేసుకోలేదు. అందులోని ఆప్యాయత నే చూడగలిగాడు. అట్లా మాష్టారు పిలిచేప్పుడు అతని మనస్సంతో ఉప్పొంగేది. బాజ్జీకి మాత్రం "ఏమోయ్" అని ఆ ఉపాధ్యాయుడన్నప్పుడల్లా బాధగా ఉండేది. ఆయన తన్ను కించపరుస్తున్నాడా అన్న భావం అతనికి చూచాయగా తోచేది.

రాము నాన్న పేదవాడైనా, చాల గౌరవంతో బ్రదుకుతూన్న మనిషి. వాళ్లెప్పుడూ తిండికి పెద్దలోటు పొందలేదనే చెప్పాలి. అయితే వాళ్ళకు గుడ్డలకు కావలసినంత లోటు ఉందని చెప్పక తప్పదు. బట్టలు అట్టే లేకపోవడంవల్ల రాము మాసిన గుడ్డలే కట్టుకుంటూ ఉండేవాడు. వీలుగా ఉంటే తనే చాకిరేవు పెట్టేవాడు. అతని చొక్కాలు సర్వసాధారణంగా భుజాలమీద కోపగించేవి. ఆ చిరుగు కనిపించకుండా అతను ఆ చొక్కా చేయిని ఆ చినుగులోనికి త్రోసి భుజం దాపుగా ఆ చిరుగును, లోకానికి కనుపించకుండా మూసేవాడు. అయితే ఆ పక్షవాతంచేయి. అస్తమానం జారిపోయేది. ఇతను అస్తమానం దాన్ని పైకి ఎగద్రోసేవాడు. ఇట్లా చేయడంవల్ల అతని చేతి మురికి, అక్కడ దట్టంగా అంటుకొని, అక్కడ అసహ్యంగా తయారయ్యేది. ఇది చూస్తే బాజ్జీకి డోకువచ్చేది. ఇతనితో తిరగటం అతనికి మనస్కరించేది కాదు. కాని రాము, తను బడికి పోయే మార్గంలోనే ఉన్న బాజ్జీ ఇంట్లో అతనికోసం ఎప్పుడూ వాకబు చేయకుండా పోయేవాడు కాదు. బాజ్జీ రాముకన్నా ఎప్పుడూ ముందు పోయేరకం కాదు కాబట్టి, అతనితో కలసి బడికి వెళ్ళక తప్పేదికాదు.

"బాజ్జీ! బడికి పోదాంరా" అంటూ రాము లోనికిపోయి ఓ సోఫాలో చతికిలబడ్డాడు. బాజ్జీ ఇంకా తయారవుతూనే ఉన్నాడు. అతను వచ్చేవరకూ రాము ఆ సోఫాలోనే కూర్చున్నాడు "అబ్బ! ఈ సోఫాలో కూర్చుంటే ఎంత హాయిగా ఉంది" అనుకున్నాడు. అయితే "చాలా హాయిగా" ఉందని మాత్రమే రాము అనుకున్నాడుగాని—వీళ్లు ధనవంతులు—మేము బీదవాళ్ళము—మాకివి లేవు-వీళ్ళకివి ఉన్నాయి ఇల్లా ఎందుకు జరిగింది?" అని మాత్రం అసలుకూడ ఆలోచించలేదు. సరిగదా అందుకు విచారించనూ లేదు. "గాడిదగుడ్డు ఇవన్నీ మా పెదనాన్న గారింట్లో లేవా?" అని అనుకున్నాడు. రాము పేదవాడైనా అతని మనస్సులో మాత్రం పేదతనం లేదు. అందుకనే ఏమాత్రం జంకూగొంకూ లేకుండా ఆ సోఫాలో కూర్చున్నాడు "ఏయ్ రామూ... పోదాంరావోయ్" అంటూ బాజ్జీ తన గదిలోంచివస్తూ, రాము సోఫాలో కూర్చోవడం చూశాడు. అది అతనికి నచ్చలేదు. "రాము వట్టి దరిద్రుడు. అంతేకాదు. ఎలాంటి మురికి బట్టలు కట్టుకున్నాడో! వీడు కూర్చుంటేసోఫా పాడైపోతుంది కూడాను" అనుకున్నాడు. కాని పైకి "మా నాన్నగారు చుస్తే కోప్పడతారు. నువ్వెప్పుడూ ఆ సోఫాలో కూర్చోకు రామూ" అన్నాడు. రాము మొగం వివర్ణమైపోయింది. అతనికి మాటలు రాలేదు. వాళ్ళిద్దరూ అలాగే మూగవాళ్లులా బడికి వెళ్ళారు. మరునాటినుంచి రాము, బాజ్జీనికలవటం మానివేశాడు.

రాము రాకపోవటం బాజ్జీకి ఇష్టంగానే ఉంది. కాని అతనికి, తోడులేకుండా నడచి బడికిపోవటం ఏమీ బాగుండలేదు. ఏమీ తోచ

డం లేదుకూడాను. అంచేత నేకాబోలు ఓరోజున అకస్మాత్తుగా "ఏరా రామూ! మా యింటికి రావడంమానేశావు" అన్నాడు బాజ్జీ. ఇది వినగానే రాము, "అరే వాళ్ళింటికి ఎందుకు వెళ్ళడం మానేశాను?" అనుకున్నాడు. ఆలోచించిచూస్తే ఇందులో బాజ్జీతప్పు ఏమీ ఉన్నట్లు కనుపించడమే లేదు. మళ్ళీ అతనెంతో ప్రేమతో పిలుస్తున్నాడు కూడాను. ఇలా అనుకుంటూనే "అబ్బే ఏమీ లేదురా" అన్నాడు రాము. రాము ఎప్పుడైతే తనను "రా" అని సంబోధించాడో అప్పుడే బాజ్జీ మళ్ళీ కలవరపడ్డాడు. "వీడు నన్ను రా అనటం ఏమిటి?" అనుకున్నాడు. వీడితో ఎందుకు మాట్లాడేనా అనిపించిందతనికి. తీరా పిలచిన తరువాత వద్దనలేక పోయాడు. ఈవిధంగా వాళ్ళకు మాటలు కలవటం— రాము తిరిగి బాజ్జీ ఇంటికి హాజరుకావటం— బాజ్జీ రాము పిలచే "రా" కు క్రమేణా అలవాటు పడటం జరిగింది.

ఇప్పుడు రాము వాళ్ళింట్లోనికి మునుపటి కన్నా నిర్భయంగా పోతాడు. ఏమంటే ఎవరైతే. "సోఫాలో కూర్చుంటే కోపగిస్తా"రని బాజ్జీ అన్నాడో ఆ బాజ్జీ నాన్న, రాము నెంతో ప్రేమతో చూస్తూ "మీ నాన్న చాలా గొప్పవాడు. పాపం చితికిపోయాడు" అని చెప్తూ రోజూ రాముతో కులాసాగా ఏదో కాలక్షేపం చేస్తూ ఉండేవాడు. బాజ్జీ కిది నచ్చలేదు. "సరే! చిట్టిగాణ్ణి తీసుకొచ్చినప్పుడు— వాడు సోఫాలో కూర్చున్నప్పుడు మా నాన్న అసహ్యించుకున్నాడేం?" అనుకున్నాడు. ఇలా వాళ్ళ నాన్న రాముతో మాట్లాడటం అతనికి చాల విచిత్రంగా తోచింది.

ఇప్పుడు రాము తనకు చొక్కాలు కావలిస్తే బాజ్జీ బీరువాలోనివి స్వయంగా తీసుకొని తొడిగేసుకుంటాడు. ఇట్లా తొడుక్కున్నప్పుడల్లా "చాకలి బట్టలు తేలేదు. ఉతికి మళ్ళీ ఇచ్చేసెయ్యనేమిటి?" అనుకుంటాడు. ఇట్లా చేస్తూన్న రామును చూస్తే బాజ్జీ, "వీడి బాబుగారి సొమ్ము దాచిపెట్టినట్లు ఎట్లా తొడుక్కుంటున్నాడో" అని అనుకుంటాడు. కాని పైకి ఇద్దరూ, ఆ బట్టలు తొడుక్కునే సమయంలో, నవ్వుతూ వుంటారు; పాపం. ఒకరి భావం ఒకరు అర్థం చేసుకోకుండానే!

ఇక సినిమాకు వెళ్ళడానికి రాముదగ్గర డబ్బులుండవు. ఈ సంగతి ముందుగా బాజ్జీతో కదపటానికి అతను వెనుకాడడు కాని బాజ్జీ మాత్రం రాము తనకన్న ముందుగా "సినిమాకు వెళ్దాం రారా" అని అంటే ఎంతో బాధ పడతాడు. ఆ సంగతి తనే ముందుగా చెప్పాలి. రామును తను రమ్మని పిలవాలి. వాడు టిక్కెట్లు తేవటానికి తను డబ్బు లిచ్చేదాకా ఆగాలి. ఇట్లాచేస్తే తన కానందం. కాని ఇది ఇట్లా జరగక ముందుగానే రాము. "నాదగ్గా డబ్బు లేమైనా ఉంటే సినిమాకుపోదాం" అంటాడు. అప్పుడు బాజ్జీ, "ఏం సినిమాలం పోనిస్తూ" అంటాడు. కాని రాము, "చాలా మంచి సినిమారా; పోదాం పద" అని బలవంతం చేస్తాడు. ఈసారి బాజ్జీ కాదనలేడు. అలా అంటే తను డబ్బులకు వెనకాడుతున్నట్లు అనుకుంటాడేమోనని అతని భయం. ఇది చూసి "తన మాట ఇంతకన్నా వినే స్నేహితు డెవడుంటాడ"ని అనుకొంటాడు రాము.

రోజులు నడుస్తూన్న కొద్దీ బాజ్జీ రాములకు వయసు తగుము గ్గూంది వయసుతో బాటు వాళ్ళ చేతల్లో కూడా కొత్త మార్పు లారంభిస్తున్నాయి. ఇప్పుడు రాము, బాజ్జీని సినిమాకు వెళ్దాం రమ్మని అడగడు. బాజ్జీ రామును, "రావోయ్ సినిమాకు పోదాం" అని తొందర చేస్తాడు రాము "ఎందుకు డబ్బు దండగ" అంటాడు. బాజ్జీ ఈ మాటకు బాధ పడతాడు. "ఏమిటోయ్ డబ్బు దండుగ. రమ్మంటూంటే" అంటాడు తాపీగా. అయితే ఈ మాటలోని అధికారాన్ని రాము గుర్తించక పోడు. కాని దానికి అడ్డు చెప్పడు. తను బాజ్జీకి శారీరకంగా మానసికంగా బానిసైపోతున్నానా అనుకుంటాడు. ఇప్పుడు బాజ్జీ రామువైపు చూసి జాలిపడతాడు. కాని ఇదంతా ఓ క్షణం. మళ్ళీ ఆ జాలి నాశనమైపోతుంది. "ఏమిటి వీడికి వెధవ బెట్టుసరి?" అనుకుంటాడు. రాము కూడ "క్షవరమయ్యేది వాడికిగాని నాకు కాదుగా. డబ్బు ఎట్లా వచ్చిందో తెలియనివాళ్లు ఇట్లా కళ్లు మూసుకుని

ఖర్చు పెడుతూవుంటే నే నెందుకు మధ్యన అడ్డురావడం?" అనుకుంటాడు.

ఇప్పుడు రాము కట్టవలసిన కాలేజీ జీతం కూడ బాబ్జీయే చెల్లిస్తున్నాడు. ఇట్లా చెల్లిస్తున్నప్పుడల్లా ఓ బీదవాణ్ణి చదివిస్తున్నాను గదా అని తృప్తిపడతాడు. రాము, తన చదువైన తరువాత ఏదైనా మంచి ఉద్యోగం సంపాదించి, బాబ్జీ ఇచ్చిన డబ్బంతా ఇచ్చిపారెయ్యా అని ఆలోచిస్తూ వుంటాడు. ఇప్పుడు బాబ్జీ ఏ అధికారాన్ని చలాయించినా రాము అతని ఎదుట యేమీ అనలేని పరిస్థితిలోనికి దిగజారిపోయాడు. అయితే ఆ అధికారాన్ని నిజంగా చలాయిస్తున్నట్టుగా బాబ్జీ గ్రహించుకోవడం లేదు.

ఇద్దరూ బట్టల కొట్టులోనికి వెళ్లుతూ వుంటారు. బాబ్జీ తనకు కావలసినన్ని బట్టలు తీసుకుంటాడు. రాముని కూడా తీసుకోమంటాడు. రాము తన కక్కర్లేదంటాడు. "అరె. తీసుకోమంటూంటే" అంటాడు బాబ్జీ విసుగుతో. రాముకు మరి గత్యంతరము లేదు. ఇది రాముకు నిజంగా ఉపకారమే. కాని ఈ ఉపకారాన్ని రాము ఇట్లా గ్రహించలేదు. అయితే బాబ్జీకి ఇంతకన్నా మరొక విధంగా చెప్పటం కూడా చేతగాదనే చెప్పాలి. సినిమాదగ్గర రామును టిక్కెటు తీసుకరమ్మని అంటాడు. రాము బాధపడతాడు. అయితే రాము ఈ విషయమై బాధపడతాడని బాబ్జీ ఊహించలేదు. బాబ్జీ ఇట్లా ఎందుకు చేస్తున్నాడా అని రాము అప్పుడప్పుడు ఆలోచిస్తూ ఉంటాడు. ఇట్లా ఆలోచించినప్పుడల్లా బాబ్జీకి తనపై వాత్సల్యం లేదని అనుకుంటాడు. "అయితే తనగురించి ఖర్చు పెడుతూన్నదంతా దేనికి?" అన్న ప్రశ్న అతనికి తోస్తుంది. దానికి జవాబుగా "అతని తత్వమే అంత" అన్న ఊహ ఆ సందేహాన్ని తీర్చేస్తుంది. కాని రాము ఇంకా ఆలోచిస్తూనే ఉంటాడు. "తనమీద ప్రేమ లేకపోతే తాను అడగకుండానే బాబ్జీ ఎందుకీ సహాయం చేస్తాడు" అనుకుంటాడు "నిజంగా బాబ్జీకి తనపై ఎంతో ప్రేమ ఉంది" అనుకుంటాడు. కాని వెంటనే అతని మనసులో మరొక ఊహ మెరుస్తుంది. బాబ్జీ గుణం చిన్నప్పటినుంచీ ఏమీ మంచిది కాదని అందుకు సంబంధించిన విషయాలన్నీ అతనికి జ్ఞాపకానికి వస్తాయి. ఆ వేళ తనరక్తం తుడిచినప్పుడు కూడా బాబ్జీ సద్భావమున్నట్టు ఊహించలేననుకుంటాడు. అంచేతనే అతను తన తండ్రి కోపగిస్తాడా వంకతో తన దారిద్ర్య స్వరూపాన్ని ఆ సోఫాలోంచి లేచిపొమ్మన్నాడని బాధపడతాడు. కాని ఏమి చేయగలడు పాపం! "ఏదో ఇ! ఇట్లా జరుగుతూంది; ఇప్పుడు మన అవసరం" అనుకుంటాడు. బాబ్జీ పురమాయించే పనులను నిర్వర్తిస్తూ ఉంటాడు. ఇట్లా చేస్తున్నప్పుడల్లా బాబ్జీ రామును చూసి, "రాము ఎంత మంచివాడు!" అనుకుంటాడు. అలా అనుకుంటూనే. "అబ్బో! అతనికెంత గర్వమో! మనమింత అడగకుండానే అన్నీ చేస్తున్నామా; అయినా కాస్తకూడ కృతజ్ఞత ఉన్నట్టు కనుపించదు!" అనుకుంటాడు.

ఇట్లాంటి పరస్పర విరుద్ధ భావాలు కల వీరిద్దరూ స్నేహితులు. పాపం! వీరు త్వరలోనే దూరమై పోవలసిన అగత్యం ఏర్పడింది.

బాబ్జీతో ఓనాడు రాము "నేనిక ఈ ఊళ్లో ఉండను బాబ్జీ" అన్నాడు. "ఏం? ఇక్కడ నీకు కష్టంగా ఉందా" అన్నాడు వెంటనే బాబ్జీ. ఇట్లా అన్నందుకు ఎందుకో బాధపడ్డాడు. ఇది అంది పుచ్చుకుని రాము "లేదు, నిజంగా నీ సహాయం మరచిపోలేను బాబ్జీ, కాని మెడ్రాసులో మా మామయ్య అక్కడ తన పత్రిక విషయాలను చూడటానికి వచ్చేయమంటున్నాడు. వెళ్ళామని ఉంది." అన్నాడు. ఇందుకు బాబ్జీ ఏమీ మాట్లాడలేదు. కాని కాస్సేపాగి, "నిజంగా వెళ్ళిపోతావా రామూ!" అన్నాడు హృదయాలు ద్రవించేట్టు. రాము కడుపులో చేయిపెట్టి దేవినట్టయింది. అతని కళ్ళలో నీళ్లు నిండుకున్నాయి. ఇంతలో బాబ్జీ "సరే వెళ్లు" అన్నాడు సామాన్యంగా. అలా అని వెంటనే నవ్వుతూ, "అయితే రేపటినుంచి మాకు ఖర్చు తగ్గుతుందన్నమాటే!" అన్నాడు. ఈ మాటతో రాము మొహం పాలిపోయింది. ఆ మాటలో ప్రేమ ఉన్నదో లేక దాని వెనకాల రాక్షసత్వమే దాగి ఉన్నదో అర్థంకాని

రాము మొగం ఓ వెలలేని నవ్వు ప్రదర్శించి ఊరుకుంది.

రాము వెళ్ళిపోయాడు. అప్పటినుంచీ బాబ్జీకి ఏమీ తోచేదికాదు. కొన్నాళ్ళవరకూ కాలం అదోలా దొర్లిపోయింది. తరువాత కొంతమంది క్రొత్త స్నేహితులు కలిశారు. డబ్బు చాలా పట్టుకు—వాళ్ళమూలాన కాకపోయినప్పటికీ తింటూ కూర్చుంటే కొండలైనా తరిగిపోతాయి కాబట్టి—అతనిధనం క్రమేణా హరించిపోవడం మొదలుపెట్టింది. కొన్ని భూములుకూడా అమ్మివేయవలసి వచ్చేది. కొడుకును విశ్వవిద్యాలయంలో చదివించటానికి, అతనికి నెలనెలా డబ్బు పంపటానికి చాల బాధపడేవాడు. ఇక కుమార్తెకు పెళ్ళి చెయ్యవలసిన సమయం కూడ దగ్గర పడింది. ఆమె పెళ్లి మునుపటి హుందాతో ఇప్పుడు చేయటానికెక్కడా ఆస్కారం లేదు. కాని అందుకాతని తాపత్రయం చెప్పతరంకాదు. నిజానికి యీ గొప్పతనంతో వచ్చిన చిక్కే! ఇది ఉండకనే ఉండక పోవాలిగాని ఉంటే దాన్ని వదలించుకోవటం బహు కష్టం! అది వదలిపోయినా అది ఉండాలని మాత్రం జిడిగింజలా పట్టుకు వ్రేలాడుతా రీమానవులు. బీదవాళ్ళను బట్టి చూసినా, మధ్యతరగతి ప్రజల్ని బట్టిచూసినా, బాబ్జీ ఏమంత బీదవాడుకాదు. కాని ఇప్పుడా తను పుట్టెడు దరిద్రం అనుభవిస్తున్న వాడిలా తలపిస్తున్నాడు.

ఈ దెబ్బతో అతనికి రామునుగురించి కర్ణాకర్ణిగా వింటూన్న సంగతులమీదకే బుద్ధి పోతూంది. ఇప్పుడు రాము చెన్ననగరంలో అద్భుతంగా వ్యాపారం సాగిస్తున్నాడని అందులో లక్షలార్జించాడని విన్నాడు. ఐతే మొదట్లో రాము వ్రాసిన జాబులకు బాబ్జీ కొన్నింటికి జాబు వ్రాసినా, తరువాత సహజంగా ఉన్న బద్ధకంవల్ల జాబు వ్రాయడం మానివేశాడు. ఆతరువాతరాముజాబులు వ్రాయక పోవటం బాబ్జీకి చాలా బాధ కలిగించింది. తను ఉత్తరాలు వ్రాయకపోయినా, రాము మాత్రం వ్రాస్తూఉండాలని వాంఛించేవాడు. అందువల్ల రాముకు ఈషణ్మాత్రమైనా కృతజ్ఞత లేదని మనసులో భావించేవాడు. మద్రాసు నుంచి ఎవరైనా వచ్చి రాము సంగతి ఏమాత్రం చెప్పబోయినా, కసరి మీదపడేవాడు. అతని మాట తనవద్ద వినబడనిచ్చేవాడుకాదు. కాని నిత్యం ఆ రామునుగురించే ఆలోచించేవాడు. అప్పుడప్పుడు రాముదగ్గర కనీసం అప్పుగానైనా కొంత డబ్బు పుచ్చుకోవాలనే ఊహ తట్టేది. కాని వెనువెంటనే "ఛీ, ఛీ. వాడిదగ్గరా?" అని మనస్సును కసరేవాడు. అంతటితో అది నోరు మూసుకొనేది.

ఇక రాము వర్తకంలోపడి సమస్తమూ మరచిపోయాడు ప్రస్తుతం అతనికదే ప్రాణంలా వుంది. లేచిన దగ్గరనుంచి నిద్రపోయేవరకూ అతని కొకటే వ్యాపారం అభివృద్ధిని గురించిన ఆలోచన. ఇదే ఆలోచనతో అతనెప్పుడూ సంచరిస్తూ ఉంటాడు. ఓ రోజున రాము కారులో బీచిమీదుగాపోతూ ఓ చిరకాల పరిచితుణ్ణి తన వూరివాణ్ణి చూశాడు. అతనితో రాము కెందుకనో మాట్లాడాలని బుద్ధి పుట్టింది. రాము కతని ఊరివారు ఇంతకుపూర్వం ఆ మహానగరంలో చాలసార్లు కనుపించారు. ఐతే అతను ఎప్పుడూ వాళ్ళతో మనసువిప్పి మాట్లాడలేదు. ముక్తసరిగా మూడే మూడు మాటలు కుశల ప్రశ్నలు లాంటివి మాట్లాడి అక్కడనుంచి వెళ్ళిపోయేవాడు. వాళ్ళతో అట్టే మాట్లాడితే ఎక్కడ పనులు పురమాయిస్తారో అని రాము బెదిరేవాడు "పట్నంలో ఉన్నావు పలుకుబడిగలవాడివి. ఈ మాత్రం పనిచేసి పెట్టలేవా" అంటారు వాళ్లు. అప్పుడు ఇరుకున పడవలసి వస్తుంది. ఇటువంటి వంటే రాముకు తలనొప్పి! అంచాత ఇలాంటి వాటిల్లో రాము జోక్యం కల్పించుకొనేవాడు కాదు. అట్టేసేపు వాళ్లతో మాట్లాడేవాడు కాదు.

ఆ వేళ రాము కారులో ఎవరూ లేదు. చుట్టూ చూసినా పరిచయమున్న మొగమేదీ లేదు. అప్పుడే ఇంటికిపోవటాని కతనికంత మనస్కరించలేదు. ఆసమయంలోనే ఆ పరిచితుడు కనిపించడం అతనితో కాస్సేపు బాతాఖానీ వేద్దామనే ఉద్దేశ్యం కలగటం జరిగింది. పాపం ఆ పరిచితుడు రామును ముందుగా పోల్చుకోలేదు. కాస్సేపు నిదానంగా చూసి

అబ్బ! నువ్వా! బాబ్జీతో ఉండేవాడివి. ఆ రామువే కదూ! ఎంతగా మారిపోయావు" అన్నాడతను. రాము ముఖం వెంటనే కళావిహీనమైపోయినది. అతని వ్యక్తిత్వము ఘాటుగా దెబ్బతిన్నట్లయినది. కాని వెంటనే తమాయించుకొని "అయితే బాబ్జీ ఇప్పుడెలా ఉన్నాడు?" అన్నాడెలాగో. వెంటనే అతను, "పాపం బాబ్జీ ఇప్పుడు పూర్తిగా చిదికిపోయాడు అతనికి రోజులు గడవడమే కష్టముగా ఉంది" అన్నాడు. వెంటనే రాము "ఆ.. !" అనిమాత్రం ఎలాగో అనగలిగాడు "అవును రామూ! ఇప్పుడాతను తన కొడుకునే చదివించుకోలేని స్థితిలో ఉన్నాడు." ఆ ముక్క వినగానే రాము గుండెలు రెపరెపలాడినవి. వెంటనే అతనిని కారులో కూర్చుండమని ఇంటికి తీసుకవెళ్ళాడు. బాబ్జీని గురించి చాలా సంగతులు అడిగాడు. అతను, "బాబ్జీకి ఆ ఊళ్ళో ఇక అప్పుకూడ పుట్టడం కష్టం" అని చెప్పేసరికి రాము ఇక వినలేకపోయాడు అతని హృదయం ఒక్కసారిగా వెళ్ళి బాబ్జీదగ్గర వ్రాలాలని ఆశించింది. అయితే రాముకూ బాబ్జీకి మధ్య మూడువందల యాభై మైళ్ళ ఎడము, అంతులేని అఖాతము ఏర్పడివుంది. ఇది దాటుకొని పోవాలిగదా! జాగ్రత్తగా చేరగలిగితే శీఘ్రగా కలయిక!

రాము మరునాడే బాబ్జీవద్దకు బయలుదేరాడు. ఏదో క్షమించరాని తప్పు చేసినట్లు రాము తలపోశాడు. ఫస్టుక్లాసులో కూర్చొని ప్రయాణం చేస్తున్నా అతనికేమీ సుఖమనిపించడంలేదు రైలు ఇక్కడ మాయమై అక్కడ అవతరించకూడదా అని అతని హృదయం ఆరాటపడింది. "అబ్బ! బాబ్జీ ఎంత మంచివాడు! బాబ్జీ అంత మంచివాళ్ళింకెవ్వరున్నారు?" అనేముక్క వేయి కంఠాలతో అతనిలో ప్రతిధ్వనించడము మొదలుపెట్టింది ఇప్పుడాభవనం-బాబ్జీ నివసించేది-ఎట్లా అందవిహీనమైన ఉందో, రాము ఊహించుకోలేకపోయాడు. "పూటకోజత విప్పుతూ ఎప్పుడూ మల్లెపువ్వులా ఉండేబాబ్జీ, ఇప్పుడెన్ని ఇక్కట్లు పడుతున్నాడో! పాపం ఇప్పుడు కొడుకునే చదివించుకోలేకపోతున్నాడు. ఎలాంటి బాబ్జీ


# ఆంధ్ర బ్యాంకు లిమిటెడ్

(షెడ్యూల్డు బ్యాంకు)

స్థాపితము — 1923

హెడ్డాఫీసు :- మచిలీపట్టణము.

చెల్లింప బడిన మూలధనము, రిజర్వులు
రు. 39,06,000 పైబడినది.

అమలునందున్న వ్యాపారము
రు. 6,00,00,000 మించినది.

మద్రాసులో బ్రాంచీలు :
మద్రాసు బ్రాంచి: 322-23, లింగిచెట్టి స్ట్రీటు.
మైలాపూర్ ఆఫీసు 77, కచ్చేరి వీధి.
త్యాగరాయ నగర్ ఆఫీసు :
87, పాండీ బజారు.

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు

అమలాపురం, అనకాపల్లి, అరండల్ పేట, (గుంటూరు) బాపట్ల, భీమవరం, చీరాల, ఏలూరు, గవర్నరు పేట, (విజయవాడ), గుడివాడ, గూడూరు (నెల్లూరు జిల్లా), గుంటూరు, కాకినాడ, మచిలీపట్నం, నరసరావుపేట, నెల్లూరు, ఒంగోలు పాలకొల్లు, రాజమండ్రి, శ్రీకాకుళం, తెనాలి, టౌను విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం. (సిటీ)
అముదాలవలస, (శ్రీకాకుళం జిల్లా), అనంతపూర్, బళ్లారి, కడప, చల్లపల్లి (కృష్ణా జిల్లా), దుగ్గిరాల, గొల్లప్రోలు, ఇచ్ఛాపురం, (శ్రీకాకుళం జిల్లా) జగ్గయ్యపేట, కర్నూలు, మహారాణిపేట (విశాఖ పట్నం), నరసన్నపేట (శ్రీకాకుళం జిల్లా), పార్వతీపురం, పెడన (కృష్ణాజిల్లా) పెద్దాపురం, పిఠాపురం, రామారావుపేట (కాకినాడ), సాలూరు, సామర్లకోట, తిరుపతి, వినుకొండ

అన్ని విధములైన బ్యాంకింగు వ్యాపారములు, ఫారిన్ ఎక్స్చేంజి సహా కొనసాగింపబడును.

తాడేపల్లి శ్రీరాములు,
మేనేజింగ్ డైరెక్టర్.

**ఇ. రామచంద్రమూర్తి,**
ఎమ్. ఏ. సి. ఏ ఐ ఐ బి,
జనరల్ మేనేజరు

ఎలాంటి గుర్గతి! ఛీ ఛీ. నావంటి మిత్రద్రోహి ఇంకొక డెవ్వడూ ఉండడు. ఇన్నాళ్లు బాబ్జీ చూడకుండా ఉండగలగటం నాకే తగు!" రాముకు కొద్దిగా నిద్రపట్టింది. ఆ కొద్దిపాటి నిద్రా మత్తుగా మారుతూంది.

మెయిలు జాగ్రత్తగా చేరవలసిన చోటుకు చేరింది. ఇక రాము చేరవలసిన చోటుకుచేరాలి. పూర్తిగా ముస్తాబైన రాముతో ఒక్కసారిగా "ఇదేమిటీ నీవు బాబ్జీ ఇంటికి వెళ్ళడమేమిటి?" అంది అతని మనస్సు. "నిజంగా నీకు మతిలేదు రామూ! లక్షల కధికారివైన నీవు నీతో పోలిస్తే ఎందుకూ కొరగాని ఆ బాబ్జీ ఇంటికి వెళ్ళడమా? ఇదేమిటి రామూ—నువ్వ ఇలాంటి పని చేస్తున్నావ్?" రాము రెండడుగులు ముందుకు వేసి ఆ ప్లాటుఫారంమీద అప్రయత్నంగా నిలబడి పోయాడు. దీని భావమేమిటో అర్థంకాని పోర్టరు ఓ అడుగు వెనక్కువేశాడు. "నీవంటే కాస్తకూడ ఇష్టంలేని ఆ బాబ్జీదగ్గరకెట్లా వెళ్తున్నావు రామూ? బలేరాముడే! అప్పుడు నీచేత అడ్డమైన చాకిరీ చేయించుకున్నాడా బాబ్జి. మరి ఇప్పుడు నిన్ను పిలవకుండానే తన ఇంటికి రప్పించుకుంటున్నాడు. నిజంగా బాబ్జీ ఎంతైనా గట్టివాడు. ఇంతకీ నీవింతదుర్బలుడ వెట్లా అయ్యావయ్యా! అయ్యయ్యో!" రాముకు బాబ్జి ఇంటికి వెళ్ళడానికి కాళ్ళాడలేదు. అయితే సైకిలురిక్షావాడు'బాబూ ఎక్కడకు'అన్నాడు, రాము చెప్పకుండా ఉండలేక పోయాడు.

"రిక్షా వాళ్ళందరికీ తెలుసు కాబోలు! సరిగ్గా బాబ్జీ ఇంటముందు ఆపాడు. అబ్బ! ఈ భవనమెంత సుందరంగా ఉంది! అరె! బాబ్జీ పేదరికం అనుభవించడం లేదా? దీని నింత అందంగా యెట్లా ఉంచగలిగాడు? లేక ఇంకెవరైనా ఉంటున్నారా? లోపల పరిచారికుల అలజడి లేదు. పూర్వం తను కూర్చున్న సోఫాలే అవి! అక్కడే ఉన్నాయి. ఎంత పరిశుభ్రంగా ఉన్నాయి! తన దగ్గర ఇంత డబ్బు ఉన్నా తన ఇల్లు ఇట్లా ఉండగు!"

చీమ చిటుక్కుమన్నా వినబడేంత నిశ్శబ్దంగా ఉంది రాము ఆ సోఫాలో కూర్చున్నాడు. కూర్చుండగానే "మా నాన్న కోప్పడతాడు. అందులో కూర్చోకు రామూ" అన్నట్టు వినిపించింది. రాము వెంటనే లేచి పోయాడు లోపల బాబ్జీ ఉన్నాడో లేడో, పిలవనామానసా అని అనుమానించాడు బాబ్జీ వచ్చేవరకు అతని మనస్సు నిలబడుటలేదు. అది జివ్వన లాగుతూంది. కాళ్ళకు నుదురుకూ చెమట హెమ్ముతూంది. ఇంతలో బాబ్జీ బయలు దేరినట్లు లోపల బూటు అలికిడైనది. రాము నిలుచున్నవాడు నిలుచున్నట్లుండక కాళ్లుకదిపి కదిపి రెండడుగులు వేశాడు. "ఛీ. నేనెందుకిట్లా తడబడటం?" అనుకున్నాడు. అప్పుడే ఆ తడబాటు సర్దుకోనముందే బాబ్జీ ఎట్ట ఎదుట నిలిచి ఉన్నాడు. రాముకు యేమి మాట్లాడాలో తోచలేదు. "ఓ రామూ...!" జరుగని దేదో జరిగినట్లుగా అనేశాడు బాబ్జీ. "మరే"నన్నట్టుగా రాము ముఖము స్ఫురింప జేసినది. కాని రాము నోటివెంట మాట పెగిలి రాలేదు. కాని బాబ్జీ, "మళ్లీ మాకు ఖర్చు హెచ్చించడానికి వచ్చేవేమిటి?" అన్నాడు. రామూ మొహం పూర్తిగా వివర్ణమైపోయినది. బాబ్జీ ముఖంలో ఏదో నవ్వు అవ్యక్తంగా గోచరించినది. రాము హృదయం క్షణంలో భగ్గున మండినది. అతని ధనం 'అవమానం! అవమానం! ఇది భరించ నలవికాని అవమానం!' అని లక్ష కంఠాలతో ఎలుగెత్తినది. బాబ్జీ నవ్వినట్లుగానే ఓ నవ్వు నవ్వి, రాము 'కాదు ఈసారి మిమ్మల్ని పోషించడానికే వచ్చాను' అన్నాడు. అన్నవాడన్నట్టుగా ఉండక, వెంటనే నాలుక కొరుక్కున్నాడు మళ్ళీ ఇట్లా నాలుక యెందుకు కొరుక్కున్నానా అని బాధపడ్డాడు. వెంటనే బాబ్జీ గుండెల్లో ఏ బాకు దింపినట్లయినదో కాని, అతను 'ఛీ ఎవడవురా నువ్వ మమ్మల్ని పోషించడానికొచ్చానంటావు! గుమ్మం దిగు ముందు!' అన్నాడు. రాము హృదయంలోని లక్షలు ఏమీ మాట్లాడ సాహసించలేక పోయినవి బాబ్జీకి ఎగురుగా ఏమీ జవాబు చెప్పలేక పోయినవి. పాపం రాము పేదవాడుగా, ధనవంతుడుగాకూడా బాబ్జీ ముందు ఓడిపోయానే అని క్రుంగిపోయాడు.

రాముకు ఇప్పటికీ తీరని సమస్యే—బాబ్జీని ఎందుకు ఎదుర్కో లేకపోయానా అని—పాపం!